రంకెేసిన కోడెగిత్తలు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట, అరిగిలవారిపల్లె గ్రామాల్లో కనుమ సందర్భంగా బుధవారం జల్లికట్టు నిర్వహించారు. తమ కోడెగిత్తలు, ఆవులు, దూడల కొమ్ములకు రైతులు రంగులేసి నగదు, విలువైన వస్తు సామగ్రిని, వివిధ రాజకీయ నాయకులు, సినీనటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలు కట్టారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎ.రంగంపేట యాదవ వీధిలో వదిలారు. వేలాదిగా వచ్చిన యువకులు అల్లె అవతల నిలబడ్డారు. రంకెలేస్తూ జోరుగా పరుగు తీసిన కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. చెక్కపలకలను, వస్తువులను సొంతం చేసుకునే ప్రయత్నంలో కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. పశువుల ప్రతిఘటనలో కొంతమందికి గాయాలయ్యాయి. కొందరు ఇళ్లపైభాగాన, చెట్ల కొమ్మలపై నిలబడి తిలకించారు. జల్లికట్టు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అరిగిలవారిపల్లెలోనూ జల్లికట్టు ప్రశాంతంగా ముగిసింది. కొందరు స్వల్పంగా గాయపడ్డారు. జల్లికట్టుకు వేలాది మంది జనం తరలిరావడంతో ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా వెళ్ళే రోడ్డు మార్గం పూర్తిగా స్తంభించింది. ఈ కార్యక్రమంతో ఎ.రంగంపేట, అరిగిలవారిపల్లె గ్రామాలు జనసంద్రమయ్యాయి.



ఎద్దుల పరుగును చూస్తున్న నటుడు మంచు మనోజ్, మౌనిక దంపతులు

జల్లికట్టు చూసేందుకు మిద్దెలపైకి చేరిన జనం.. కోడెగిత్తలను నిలువరించేందుకు అల్లె అవతల నిలబడిన యువకులు

ఏటి పండుగ

కనుమ సందర్భంగా బుధవారం నాయుడుపేటలోని స్వర్ణముఖినది వద్ద ఏటి పండుగ ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ పండుగ సందర్భంగా మతాలకతీతంగా జనం స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోకి చేరి ఆట పాటలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- నాయుడు పేట, ఆంధ్రజ్యోతి



కొండచుట్టు

దేవేరులతో కలిసి శ్రీకాళహస్తీశ్వరుడికి బుధవారం కొండచుట్టు ఉత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి ఉదయం ప్రారంభమై గిరి ప్రదక్షిణగా సాయంత్రానికి చేరుకున్నారు. సంక్రాంతి మరుసటి రోజున నిర్వహించే ఈ కార్యక్రమం సందర్భంగా మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి కల్యాణోత్సవానికి దేవతలు, మునులకు ఆహ్వానం పలుకుతారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఎ.రంగంపేటలో ఏఐ టెక్నాలజీ హబ్

● నారావారిపల్లె క్లస్టర్‌కు సీఎం చంద్రబాబు వరాల జల్లు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ సౌజన్యంతో చంద్రగిరి మండలం ఎ.రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఐ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం గ్రామస్తులతో మంగళవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఏఐ టెక్నాలజీ ల్యాబ్ వల్ల క్లస్టర్ పరిధిలోని 8 పాఠశాలల విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా రాణించేలా తయారవుతారన్నారు. క్లస్టర్ పరిధిలోని 2160 కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. వచ్చే నెలాఖరులోగా వంద శాతం బహిరంగ మల విసర్జన లేని గ్రామాలు కావాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన 286 మందికి ఏడాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇక్కడా పైప్ లైన్ గ్యాస్ విధానం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపించాలని రైతులకు సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెంచేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభిస్తున్నామని, తద్వారా ఆధార్, కులం, నేటివిటీ, బర్త్ సర్టిఫికెట్లు, అడంగల్ వంటి 150 సర్వీసుల వరకు అందుబాటులోకి వస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. నారావారిపల్లె ఆస్పత్రిలో 5 వేల మంది వరకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.8 కోట్లతో ఎ.రంగంపేట నుంచి భీమవరం, మంగళంపేట రోడ్లను పూర్తి చేస్తామన్నారు. 500 మంది వరకు చదువుకునేందుకు, పని చేసేందుకు ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి.. శ్రీసిటీ వంటి పరిశ్రమలతో అనుసంధానించి ఉపాధి కల్పిస్తామన్నారు. రేణిగుంట సమీపంలో 10 ఎకరాల స్థలంలో రతన్ టాటా స్ఫూర్తితో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసి ఇక్కడి యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హంద్రీనీవా నీటిని మూలపల్లెకు, కణితమడుగు చెరువులకు, కల్యాణి డ్యామ్, నాగపట్ల, వెంకట్రాయుని చెరువులకు అనుసంధానం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కల్యాణి డ్యామ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. సంక్షేమ పథకాల పంపిణీలో మోసాలు జరగకుండా టెక్నాలజీని వినియోగిస్తామని వివరించారు.



మంగళవారం నారావారిపల్లెకు చేరుకున్న జనం నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు



కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు చంద్రబాబు మొక్కులు

సంక్రాంతి కార్యక్రమాల్లో సీఎం

నారావారిపల్లెలో మంగళవారం సంక్రాంతి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నారా, నందమూరి కుటుంబాలు సందడి చేశాయి. తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా పంచె కట్టిన సీఎం చంద్రబాబు.. తన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, దివంగత నారా రామూర్తినాయుడి సతీమణి ఇందిర, సినీహీరో రోహిత్, చంద్రబాబు సోదరి హైమావతి, కుమార్తె చరిత, నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ సతీమణి వసుంధర, చిన్న కుమార్తె తేజస్విని, అల్లుడు, ఎంపీ భరత్, మనవడు ఆర్యవీర్ తదితరులతో కలిసి కలిసి గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు.. కులదైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టకు పాలు పోశాక తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఉదయం 11.25 గంటలకు తన తల్లిదండ్రులు నారా ఖర్జూరపునాయుడు, అమ్మణమ్మ సమాధుల వద్ద నివాళులర్పించారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సీఎం ఇంటి బయటే ఉండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమస్యలు విన్నారు. అర గంటకుపైగా ఉండి అర్జీలు స్వీకరించారు. సాయంత్రం తన బంధువు కృష్ణమనాయుడు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. 6.35 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు, చంద్రగిరి టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయినుంచి పార్టీ పునర్నిర్మాణం

- కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం
- దొంగ ఓట్ల వ్యవహారాన్ని వదిలిపెట్టేది లేదు
- చంద్రగిరి ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశంలో లోకేశ్

తిరుపతి(విద్య)/చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ అన్నారు. వచ్చే నెల నుంచి పార్టీకోసం అధిక సమయం కేటాయిస్తానన్నారు. నారావారిపల్లెలో బుధవారం ఆయన చంద్రగిరి నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. క్లస్టర్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతీఒక్కరూ పార్టీకోసం కొంత సమయం కేటాయించాలని, మరింత చొరవగా పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని, క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయన్నారు. పార్టీకోసం అహర్నిశలు పాటుపడిన వారికే గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మనం సేవలందించాలని, అహంకారంగా నడుచుకోకూడదంటూ దిశానిర్దేశం చేశారు. యువగళంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో తనకు తెలుసని, తప్పుచేసినవారిని ఎవరినీ వదలేది లేదన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో దొంగ ఓట్ల వ్యవహారాన్ని కూడా వదిలిపెట్టేది లేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో సభ్యత్వం చాలాబాగా చేశారని నాయకులు, కార్యకర్తలను అభినందించారు. జనవరి ఒకటి నుంచే పార్టీ సభ్యులకు బీమా అమలవుతోందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే రూ.5 లక్షల బీమా ఇప్పించే బాధ్యత తనదన్నారు. కార్యకర్తల పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని, వారికి స్వయం ఉపాధి కల్పించే అవకాశాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అన్ని మండలాల ముఖ్య కార్యకర్తలను కలివిడిగా పలకరిస్తూ, వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హేమేంబరధరరావు, పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, బెల్లంకొండ మురళి, తిరుమలరెడ్డి, నాగరాజనాయుడు, ఇతర నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానితో కలిసి నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఎడారి దేశంలో మరో మహిళ ఆర్తనాదం



నాగమ్మ

తిరుపతి, జనవరి15 (ఆంధ్రజ్యోతి): ఎడారి దేశంలో మరో మహిళ ఆర్తనాదాలు సోషల్ మీడియాలో ఘోషిస్తున్నాయి. తనను ఆదుకుని ఇండియాకు పంపించాలంటూ ఆమె చేతులు వేడుకుంటున్నాయి. వెంకటగిరి పరిసర ప్రాంతానికి చెందిన నాగమ్మ.. కుటుంబ పోషణ కోసం కువైత్‌కు వెళ్లాలనుకున్నారు. రాజంపేట, కోడూరుకు చెందిన ఇద్దరు ఏజెంట్లు మంచి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. తీరా కువైత్‌కు వెళ్లాక తాను మోసపోయానని తెలుసుకున్నారు. ఎక్కువమంది జనం ఉండే ఇంట్లో ఈమె ఒక్కటే పని మనిషి. రోజురోజుకు పని ఎక్కువ కావడంతో అనారోగ్యం పాలయ్యారు. ఆ ఇంట్లో పని చేయలేనని ఏజెంట్లకు చెప్పినా పట్టించుకోలేదు. చివరికి ఆమె ఫోను చేసినా స్పందించలేదు. అక్కడ్నుంచి బయటపడే మార్గాలను వెదుకుతూ.. ఒంగోలుకు చెందిన సామాజిక సేవకుడు సర్దార్ బాషాకి ఆమె వీడియో కాల్ చేసి తన పరిస్థితిని వివరించారు. తనని ఎడారిలోకి తీసుకెళ్లి చంపేస్తారేమోనని భయంగా ఉందంటూ వీడియోలో విలపించారు. కువైత్‌లోని జహారాలో ఉన్న తనను సేట్ వాళ్లు చిత్ర హింసలు పెడుతున్నారని, అన్నం తిని నాలుగు రోజులైందని, ఒంటినిండా పుండ్లు పడ్డాయని చూపిస్తూ రోదించారు. రూ1.3లక్షలు చెల్లిస్తే ఇండియాకు పంపుతామంటున్నారని, తన దగ్గర రూపాయి కూడాలేదని వాపోయారు. ఈ విషయాన్ని సర్దార్ బాషా తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో దుబాయ్‌లోని తిరుపతివాసి డాక్టర్ ముక్కు తులసికుమార్‌కి చేరింది. వెంటనే స్పందించిన ఆయన తిరుపతి డీఎస్పీ గిరిధర్‌ని సంప్రదించి ఆమె వివరాలు అందించినట్టు తెలిసింది. గత నెలలోనూ శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ కువైత్‌లో నరకయాతన పడుతుంటే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో పోలీసులు చొరవతీసుకుని ఇండియాకు రప్పించిన విషయం తెలిసిందే.

నకిలీ టికెట్లతో దర్శనం: ఇద్దరి అరెస్ట్

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నకిలీ టికెట్లతో దర్శనానికి అనుమతిస్తున్న బాగోతం బుధవారం బయటపడింది. చెన్నైకి చెందిన జగదీష్, తిరుపతికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ శశి, ఫైర్ విభాగంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మణికంఠ గ్రూపు కట్టారు. జగదీష్, శశి పంపే భక్తులకు రూ.300 దర్శన టికెట్లపై పేర్లు, ఆధార్ వివరాలను మణికంఠ ఎడిట్ చేసి నకిలీ టికెట్లను భక్తులకు ఇస్తున్నారు. ఈ టికెట్ల స్కాన్ కేంద్రంలో లక్ష్మీపతి(లక్ష్మీశ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఉద్యోగి) వద్దకు పంపుతున్నారు. అతడు స్కాన్ చేసినట్టు నటించి దర్శనానికి అనుమతిస్తున్నట్లు. విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మణికంఠతో పాటు లక్ష్మీపతిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు చెందిన 11 మంది భక్తులకు రూ.17 వేలకు ఈ టికెట్లు విక్రయించినట్టు తేలింది. వీరిద్దరిని పోలీసులకు అప్పగించారు. దీనిపై విచారణ మొదలైంది.

ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ, హోలీక్రాస్ హైస్కూల్ మైదానాల్లో జరిగే పోటీలకు జిల్లాలోని క్రీడాకారులే అర్హులని తెలిపారు. శుక్రవారంలోపు దరఖాస్తుచేసుకోవాలని.. ఇతర వివరాలకు 93470 38584, 99660 81144, 90596 06346 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తిరుచానూరులో వేడుకగా కనుమ


బంగారు తిరుచ్చిపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయ ఉద్యానవనంలో బుధవారం వేడుకగా కనుమ మహోత్సవం జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవర్లను ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. గజరాజు, వృషభాలు, గోవులకు పూజలుచేసి ప్రసాదాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి తిరువీధి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్ నాయుడు,చలపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విరుపాక్షమ్మ ఊరేగింపు


అమ్మవారికి పట్టు వస్త్రాలు తెస్తున్న నాని దంపతులు

రామచంద్రాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కమ్మకండ్రిగలో గుర్రప్పస్వామి, విరూపాక్షమ్మ ఊరేగింపు బుధవారం మేళతాళాల నడుమ వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు ఎమ్మెల్యే పులివర్తి నాని,ఆయన సతీమణి సుధ పట్టువస్త్రాలు సమర్పించారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గంగిరెడ్డి పల్లి నుంచి టీడీపీ జెండాలతో కమ్మకండ్రిగ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్ధనచౌదరి, నరసింహారెడ్డి, రాయలచెరువు నీటిసంఘం అధ్యక్షుడు అర్జుననాయుడు, సర్పంచ్ కావ్యా వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

బొప్పరాజుపల్లిలో ఉత్కంఠభరితంగా జల్లికట్టు



రామచంద్రాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా బొప్పరాజుపల్లిలో బుధవారం జల్లికట్టు ఉత్కంఠ భరితంగా జరిగింది. గ్రామస్థులు తమ కోడెగిత్తల కొమ్ములకు రాజకీయ నాయకుల చిత్రాలతో పాటు విలువైన బహుమతులు కట్టి అల్లె వద్దకు తీసుకువచ్చారు. యువకులు కోడెగిత్తలను నిలువరించి బహుమతులు అందుకున్నారు. ఈ క్రమంలో కొందరు స్వల్పగాయాల పాలయ్యారు. పలు ప్రాంతాల నుంచి జల్లికట్టు తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు.

పాకాల: కెవడ్డేపల్లె పంచాయతీ పోలిరెడ్డిపల్లె, గానుగపెంట పంచాయతీ కూనపల్లెలో పశువులను ఊరేగించి జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను నిలువరించి బహుమతులు దక్కించుకోవడానికి యువకులు పరుగులు తీశారు. కాటమరాజువద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

రాజువారిపల్లెలో క్రికెట్ పోటీలు


విజేతలతో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్

భాకరాపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పురస్కరించుకుని మూడు రోజులుగా చిన్నగొట్టిగల్లు సమీపంలోని రాజువారిపల్లెలో జడ్పీ మాజీ చైర్మన్ వలసారెడ్డి సిద్దరామిరెడ్డి మెమోరియల్ క్రికెట్ పోటీలను వలసారెడ్డి శివప్రసాద్‌రెడ్డి నిర్వహించారు. పలు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. బుధవరం జరిగిన ఫైనల్ పోటీల్లో రాయల్ రేంజర్స్ ప్రథమ స్థానంలో, సూపర్ స్ట్రైకర్ రెండో స్థానంలో నిలిచాయి. విజేతలకు టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ కప్పును అందజేశారు.

శిల్పారామంలో ముగిసిన సంక్రాంతి సంబరాలు


గాలిపటాలు ఎగురవేస్తున్న సందర్శకులు

తిరుచానూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో మూడు రోజుల నుంచి సంక్రాంతి సంబరాలు బుధవారం ముగిశాయి. ఉదయం సందర్శకులకు పతంగుల పోటీలు నిర్వహించారు. సాయంత్రం దుర్గ బృందం అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

కన్నులపండువగా ఎల్లమ్మ రథోత్సవం


సింహవాహనంపై శ్రీదుర్గ అలంకరణలో దర్శనమిస్తున్న ఎల్లమ్మ

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కి పాలు, తెనే, వివిధ రకాల పండ్లతో అభిషేకం నిర్వహించి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం దుర్గ అలంకరణలో సింహ వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. మంగళవారం సాయంత్రం శ్రీమహిషాసురమర్ధిని అలంకరణలో భూతవాహనంపై ఎల్లమ్మను ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, కమిటీ సభ్యులు వెంకటముని, గిడ్డయ్య, నాగరాజు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. నడింపల్లె గ్రామస్తులు మంగళవారం ఎల్లమ్మకు సంక్రాంతి సారెను తీసుకొచ్చారు.

క్రికెట్ కప్ పోటీల్లో విజేత పైరేట్స్ లెవన్ జట్టు


పైరేట్స్ లెవన్ జట్టుకు కప్‌ని అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్, జనవరి15(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ వేదికగా నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ కప్ పోటీల్లో పైరేట్స్ లెవన్‌జట్టు విజేతగా నిలచింది. రెండ్రోజులపాటు నిర్వహించిన పోటీల్లో 8జట్లు తలపడ్డాయి. తుడా మాజీచైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజేతగా నిలచిన పైరేట్స్ జట్టుకు కప్‌తోపాటు రూ.10వేలనగదు బహుమతి, రన్నర్స్‌గా నిలచిన రవికింగ్స్‌కి రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా హర్షిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జనవరి15(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా తుమ్మలగుంటకు చెందిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నియమితులయ్యారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఈమేరకు తెలిపా. బీసీ విభాగం అధ్యక్షుడిగా చిన్నియాదవ్, రైతువిభాగం అధ్యక్షుడిగా మల్లం చంద్రమౌళిరెడ్డిని నియమించారన్నారు.

నమూనా ఆలయంలో శాస్త్రోక్తంగా నిత్య కైంకర్యాలు

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో మంగళవారం శ్రీవారికి నిత్య కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో నిత్య కైంకర్యాల తరహాలో ఉదయం తిరుప్పావై సేవ, తోమాలసేవ, కొలువు, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులను దర్శనానికి అనుమతించి స్వామివారి ప్రసాదాల వితరణ చేశారు. ఇక సాయంత్రం 4 గంటలకు నమూనా ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాహన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి వేడుకగా ఊంజల్‌సేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు హాజరై స్వామివైభవాన్ని తిలకించి పులకించారు. ఈనెల 18న ఉదయం 11 గంటలకు కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల విరాళాలు సమర్పించేందుకు వీలుగా టీటీడీ కియోస్క్ మిషన్ ఏర్పాటు చేసింది. ఈ మిషన్ ద్వారా భక్తులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రూపాయి నుంచి రూ.99,999 వరకు తమకు తోచిన మొత్తాన్ని విరాళంగా ఇచ్చేలా ఏర్పాట్లు చేసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతిచెందిన హరికృష్ణారెడి

పాకాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దామల చెరువు పంచాయతీ యల్లంపల్లెకు చెందిన రైతు డి.హరికృష్ణారెడ్డి (63) బుధవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో మృతి చెందాడు గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. అడ్డంగా వున్న కొబ్బరిమట్ట తీయడానికి ప్రయత్నించాడు. పచ్చి కొబ్బరిమట్ట తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

వేడుకగా గోదాదేవి కల్యాణం



తిరుచానూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీనివాసాలయంలో బుధవారం వేడుకగా గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. రంగనాథస్వామి, గోదాదేవికి ఆలయ ముఖమండపానికి వేంచేంపు చేసి కొలువు దీర్చారు. భక్తులతో మహా సంకల్పం చేయించి వేదమంత్రోచ్చారణల నడుమ కనులపండువగా గోదాదేవి కల్యాణం జరిగింది. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అఖండం శ్రీహరి పాల్గొన్నారు.

వైభవంగా పశువుల పండుగ

భాకరాపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పశువుల పండుగ వైభవంగా జరిగింది. బుధవారం ఉదయాన్నే పశువులను శుభ్రం చేసి వివిధ రకాల రంగులు, పూలతో పశువులను అలంకరించారు. సాయంత్రం పశువుల కాటంరాజు వద్దకు తీసుకెళ్లి కాటంరాజుకు పూజలు నిర్వహించారు. చిట్లాకుప్పకు నిప్పంటించారు. పశువులకు మంటలను చూపించారు.

'డాకూ మహారాజ్' వీక్షించిన నారా రోహిత్



చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని ఎస్వీ సినిమా థియేటర్‌లో మంగళవారం రాత్రి సినీహీరో నారా రోహిత్ డాకూ మహారాజ్ సినిమాను వీక్షించారు. రోహిత్‌కు థియేటర్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ నాయకులతో కలిసి రోహిత్ సినిమాను వీక్షించారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుని అభయం

తిరుచానూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన సూర్యనారాయణ స్వామికి మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం తిరుచ్చి ఉత్సవం వేడుకగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొపి అలయ అర్చకులు విశేష అభిషేకాలు నిర్వహించారు. సంక్రాంతి(ఉత్తరాయణ పుణ్యకాలం)లో బంగారు తిరుచ్చిపై సూర్యనారాయణస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

తమిళనాడు భక్తురాలి అదృశ్యం


వెళ్లతాయి(ఫైల్ ఫొటో)

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ భక్తురాలు కనిపించకుండా పోయింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు మధురై జిల్లా, సలుపుపట్టి కి చెందిన 66ఏళ్ల వెళ్లతాయి తన కుమారుడు మారియప్పన్, మరో 104 మంది భక్తబృందంతో కలిసి ఈనెల 10న తిరుమలకు వచ్చింది. ఉదయం స్వర్ణ రథోత్సవాన్ని వీక్షించాక లడ్డూకౌంటర్ వద్ద బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు, తోటి భక్తులు పరిసరాలన్నీ గాలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించగా గోగర్భం డ్యాం వైపు వెళ్లినట్టు గుర్తించారు. అక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మారియప్పన్ మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు 0877 2289027, 94407 96769 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలని పోలీసులు కోరారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు బాలుర విషాదాంతం

తిరుమలలో భవనంపై నుంచి పడి ...


మృతి చెందిన సాత్విక్

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటూ భవనంపై నుంచి కిందపడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసులు, విజిలెన్స్ వివరాల మేరకు.. కడప జిల్లా చిన్నచౌక్‌కు చెందిన శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు తమ ఇద్దరు కుమారులు నిహాంత్, సాత్విక్ శ్రీనివాసరాజు(3)తో కలిసి శ్రీవారి దర్శనార్థం 13న తిరుపతికి చేరుకున్నారు. 14వ తేదీన తిరుపతిలో 16వ తేదీకి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు పొంది బుధవారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో తిరుమల పద్మానాభ నిలయంలోని లాకర్‌ను పొందారు. తలనీలాల సమర్పణ అనంతరం వరాహస్వామిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి లాకర్ వద్దకు చేరుకున్నారు. సాయంత్రం అన్న నిహాంత్‌తో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సాత్విక్ రెండవ అంతస్తులోని మెట్ల రైలింగ్ మధ్య ఖాళీ నుంచి కిందపడిపోయాడు. గుర్తించిన శ్రీనివాసుల దంపతులు వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించారు. కాస్సేపటికే బాలుడు మృతి చెందాడు.

ఉయ్యాల తాడు మెడకు చుట్టుకుని..


మృతి చెందిన సమీర్

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఉయ్యాల తాడు మెడకు బిగుసుకుని ఓబాలుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు బీడీ కాలనీలో భర్త వదిలేయడంతో వహిదా తన సోదరుడు షబ్బీర్‌తో కలిసి ఉంటోంది. ఆమె కుమారుడు సమీర్‌కు 11 ఏళ్లు. ఇటీవల ఆమె ఉపాధి నిమిత్తం ముంబై వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఆ కుర్రాడు ఇంట్లో ఉయ్యాల కట్టి ఆడుకుంటున్నాడు. కాస్సేపటికి ఉయ్యాల తాడు మెడకు చుట్టుకుంది. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సమీర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారికి గోదామాలాంకరణ


గోదామాలలు తీసుకువస్తున్న అర్చకులు

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మహాభక్తురాలు గోదాదేవి(అండాళ్ అమ్మవారు) పరిణయోత్సవం పురస్కరించుకుని శ్రీవారి మూలవిరాట్టును బుధవారం గోదామాలలతో అలంకరించారు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో అండాళ్ గోదాదేవి నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. తిరుపతి నుంచి తిరుమల పెద్దజీయర్ స్వామి మఠానికి చేరుకున్నాక మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీవారికి మూలవిరాట్టుకు అలంకరించారు. శ్రీవారి ఆలయంలో కనుమ పండుగను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం నిర్వహించే 'కాకబలి' కార్యక్రమం కూడా బుధవారం వైదికోక్తంగా జరిగింది. పసుపు, కుంకుమ వేరువేరుగా కలిపిన అన్నాన్ని విమాన వేంకటేశ్వరస్వామికి నివేదించారు.

దుర్గసముద్రంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

తిరుపతిరూరల్, జనవరి15(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలో ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి దేవాలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి పడిపూజను వైభంగా నిర్వహించారు. మకరజ్యోతిని పురస్కరించుకుని జ్యోతిని వెలిగించి మొక్కులు చెల్లించారు. అంతకు ముందు స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున్న భక్తులు, గ్రామస్థులు పాల్గొని భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సిద్దారెడ్డి, నాగిరెడ్డి, బాలసుబ్రమణ్యం, చెంగల్రాయులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేళ భక్తులతో మమేకమైన టీటీడీ చైర్మన్


భక్తులతో అన్నప్రసాదం గురించి ఆరా తీస్తున్న చైర్మన్

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు భక్తుల మధ్యే సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో భక్తులతో కలిసి భోజనం చేసి సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. అన్నప్రసాద భవనంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యత, రుచి మెరుగుపడిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.6.92 కోట్లు

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండురోజుల్లో రూ.6.92 కోట్లు లభించింది. సోమవారం రూ.3.48 కోట్లు, మంగళవారం రూ.3.89 కోట్లు లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 78,00 మంది, మంగళవారం 74,800 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈరెండురోజుల్లో 35,132 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

అనుమానాస్పద స్థితిలో నెల్లూరువాసి మృతి


మునెయ్య మృతదేహం

ఏర్పేడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటకు చెందిన పిమునెయ్య(48) అనుమానాస్పద స్థితిలో ఇక్కడి హైవే పక్కన మృతి చెందాడు. సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... మునెయ్య భార్య పదేళ్ల క్రితం చనిపోయింది. నెల్లూరులో టీ దుకాణంలో పనిచేసే ఇతను మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సంక్రాంతి సందర్భంగా తిరుపతి మంగళంలో ఉంటున్న కుమారుడు మునిరాజా ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం తిరిగి నెల్లూరు బయలుదేరాడు. అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. మార్గ మధ్యలో మళ్లీ తాగాడు. ఈ మత్తులో మేర్లపాక వద్ద కింద పడడంతో తలకు కుడి వైపు రక్తగాయమైంది. అతిగా మద్యం తాగడం వల్ల మరణించినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ముఖ్యమంత్రికి వీడ్కోలు


ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సుధీర్‌రెడి

రేణిగుంట/ పిచ్చాటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు లభించింది. సంక్రాంతిని పురస్కరించుకుని నారావారిపల్లెకు వచ్చిన ఆయన పండుగ అనంతరం మంగళవారం రాత్రి రోడ్డు మార్గాన తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ మంత్రి చెంగారెడ్డి, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, కోలా ఆనంద్, కలెక్టర్ వెంకటేశ్వర్ సాదరంగా వీడ్కోలు పలికారు.

అర్జీలను స్వీకరించిన మంత్రి లోకేశ్

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం పట్టణంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. అలాగే దివంగత మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడికి సంబంధించిన మూడోనెల విస్తరి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం సతీమణి భువనేశ్వరితో పాటు మంత్రి లోకేశ్, బ్రాహ్మణి, నందమూరి వసుందర, నారా ఇందిరా, రోహిత్, కుటుంబ సభ్యులు విస్తరి వేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మంత్రి లోకేశ్ రేణిగుంట విమానశ్రయానికి వెళ్లారు. ఆయనకు వీడ్కోలు పలికిన వారిలో ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, డాలర్స్ దివాకర్‌రెడ్డి, హేమేంబరదరరావు, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

పక్షుల పండుగకు చకచకా ఏర్పాట్లు


అట్టకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎఫ్‌వో శెల్వ,అధికారులు

తడ/సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో స్టాల్స్ ఏర్పాటుకు టెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు స్టేజీ, పట్టణంలో జీఎన్‌టీ రోడ్డు డివైడర్లపై పచ్చదనం పరిమళించేలా మొక్కలు ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో పక్షుల పండుగ ప్రారంభంకానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను సీఎఫ్‌వో శెల్వం, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రం, అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎఫ్‌వో శెల్వం మాట్లాడుతూ పక్షుల పండగకు వచ్చే సందర్శలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో హారిక, రేంజర్ నరసింహరావు, తహసీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.

పండుగ విజయవంతానికి కృషి

పక్షుల పండుగను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మత్స్యశాఖ డీడీ నాగరాజు వెల్లడించారు. బుధవారం అటవీ శాఖ సీసీఎఫ్ సెల్వంతో కలసి భీములవారి పాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన ఏర్పాట్లపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.

నేలపట్టులో...

దొరవారిసత్రం(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, తిరుపతి సీఎఫ్(చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం పరిశీలించారు. స్టాల్స్ ఏర్పాట్లు, వీఐపీ వాహనాల పార్కింగ్, సందర్శకులకు నీటి వసతి, ఇతర సదుపా యాలపై స్థానిక అధికారులతో చర్చించారు.

ఆది దంపతుల కల్యాణానికి రారండి

- దేవతలు, మునులకు ఆహ్వానం
- వైభవంగా గిరి ప్రదక్షిణ


రాజగోపురం మీదుగా వేంచేస్తున్న స్వామిఅమ్మవార్లు

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆది దంపతుల కల్యాణానికి దేవతలు, మునులకు బుధవారం ఆహ్వానం పలికారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న ఆది దంపతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ముక్కంటి ఆలయంలో కొలువు దీరిన శివపార్వతులు యేటా కనుమ పండుగ రోజున కైలాసగిరుల ప్ర దక్షిణ చేసి దేవతలను, రుషులను ఆహ్వానిస్తారు. ఇందులో భాగంగా ఈ యేడాది కూడా ఈ కార్యక్రమం జరిగింది. మొదట జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను చప్పరాలపై అధిష్ఠింపజేసి... కైలాసగిరి ప్రదక్షిణకు బయలుదేరారు. పట్ట ణంలో విహరిస్తున్న స్వామి అమ్మవార్లకు భక్త లు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ సం దర్భంగా చతుర్మాడ వీధులు శివనామ స్మరణతో మారుమోగాయి. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూ ర్తులు జయరామరావువీధి, కైలాసగిరికాలనీ, రామచంద్రాపురం, రాజీవ్‌నగర్ మీదుగా గిరి ప్రదక్షిణకు వెళ్లారు. రామాపురం రిజర్వాయర్ సమీపంలో ఉన్న అంజూరు మండపం వద్ద స్వామిఅమ్మవార్లను ఉంచారు. అక్కడ పూజలు చేశారు. గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులకు అన్న దానం చేశారు. ఆ తరువాత స్వామి అమ్మ వార్లను వెయ్యిలింగాల కోన, వేడాం, వేడాం మిట్టకండ్రిగ, తుఫాను సెంటరు మీదుగా శుకబ్రహ్మాశ్రమం వద్ద ఎదురు సేవ మం డ పంలో కొలువుదీర్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


చాగంటి కోటేశ్వరరావు- ప్రవీణ్ సూద్- జస్టిస్ శంకరే

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం, బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉదయం దర్శించుకోగా, బుధవారం ఉదయం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శంకరే దర్శించుకున్నారు. వీరికి ఆలయం అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ప్రధానితో పరీక్షా పే చర్చకు జిల్లా విద్యార్థి


శ్రీకర్

తిరుపతి(విద్య), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతో జరుగనున్న పరీక్షా పే చర్చ కార్యక్రమానికి జిల్లాకు చెందిన విద్యార్థి శ్రీకర్ ఎంపికైనట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికచేసిన విద్యార్థులు, వారి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రధాని ప్రత్యక్షంగా సమావేశమవుతారు. పరీక్షల్లో ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశాలను విద్యార్థులకు ప్రధాని వివరిస్తారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీకర్ ఈ ఏడాది జిల్లా నుంచి ఎంపికయ్యాడు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన శ్రీకర్, ఎస్కార్ట్ ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

చాంపియన్స్ ట్రోఫీ జట్టులో స్థానమే లక్ష్యం

యువ క్రికెటర్ ఎన్‌కేఆర్


నితీష్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(క్రీడలు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ వేదికగా ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న చాంపియన్స్ ట్రోఫీకి వెళ్లేభారత జట్టులో స్థానం దక్కించుకోవడమే లక్ష్యమని యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో స్థానిక క్రికెటర్ విజయ్‌కుమార్, బాల క్రికెటర్లతో కాసేపు గడిపారు. వచ్చేవారం స్వదేశంలో ఇంగ్లండుతో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌లో 110శాతం ఆటతీరును ప్రదర్శించి, చాంపియన్ ట్రోఫీ జట్టు ఎంపికలో అవకాశాలు మెరుగుపరుచుకుంటానని అభిప్రాయపడ్డారు. ఆంధ్ర నుంచి అనతి కాలంలోనే టెస్టుమ్యాచ్‌లో ఆరంగేట్రం చేయడం, తొలి సిరీస్‌లో మంచి ఆటతీరు ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రా నుంచి మరింత మంది మంచి ఆటగాళ్లు వస్తారని భావిస్తున్నానన్నారు. టెస్ట్ మ్యాచ్‌ల నుంచి టీ20 ఆడాలంటే సవాలేనని, కఠోర సాధన చేసి వీలైనంత త్వరగా ధనాధన్ ఫామ్ అందుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లీ స్ఫూర్తిగా అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశం, రాష్ట్రానికి మంచిపేరు తీసుకొస్తానన్నారు. కృషి, పట్టుదలతో రాణిస్తేనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థానం దక్కుతుందని యువతకు సూచించారు. కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే అంతకంటే ఆనందం ఇంకేముంటుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ప్రత్యేక టూర్ ప్యాకేజీ

తిరుపతి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ తిరుపతి డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. నేలపట్టు, అటకానితిప్ప, సూళ్లూరుపేట, శ్రీసిటీ, బీవీపాళెం సందర్శక ప్రాంతాలను చూపుతామని వివరించారు. ఆ మూడు రోజులు శ్రీనివాసం, విష్ణు నివాసంలో ఉదయం 8 గంటలకు బయల్దేరి సాయంత్రం 7గంటలకు బస్సులు తిరిగి చేరుకుంటాయని తెలిపారు. రూ.500 రవాణా చార్జీలు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

సరెండర్ లీవు బకాయిలు విడుదల చేస్తాం

పదోన్నతి సమస్యలూ పరిష్కరిస్తాం : నారా లోకేష్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 15(ఆంధ్రజ్యోతి): పోలీసుల సరెండర్ లీవు బకాయిలు త్వరలో విడుదల చేస్తామని, కానిస్టేబుళ్ల పదోన్నతుల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి నారా లోకేశ్ జిల్లా పోలీసు సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, సభ్యులు పురుషోత్తం నాయుడు, శేఖర్, రాజశేఖర్‌లు బుధవారం నారావారిపల్లెలో మంత్రిని కలిసి జిల్లా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసువచ్చారు. తిరుపతి జిల్లాలో సివిల్ కానిస్టేబుళ్లకు 27 సంవత్సరాల సర్వీస్ పూర్తయినా ప్రమోషన్ రావడం లేదని, ఇతర జిల్లాల్లో 10-11 సంవత్సరాలకే పదోన్నతి వస్తోందని వివరించారు. ఇతర జిల్లాలతో పోల్చితే తిరుపతిలో ఏఎస్‌ఐ, ఎస్‌ఐ పదోన్నతులు చాలా ఆలస్యంగా వస్తున్నాయని, చాలామంది హెచ్‌సీ, ఏఎస్‌ఐలుగానే రిటైర్ అయిపోతున్నారని వివరించారు. అలాగే జిల్లా పరిధిలోని కొన్ని పోలీస్‌స్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన లోకేశ్ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


దెబ్బతిన్న బైక్, కారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్‌లో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపిన వివరాల ప్రకారం...చంద్రగిరి మండలం కల్లోటిపల్లికి చెందిన సుకుమార్ కుమారుడు సుదీప్ (19), కల్లూరు గ్రామానికి చెందిన హేమంత్ శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నారు. చంద్రగిరిలో స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని శ్రీకాళహస్తికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. చంద్రగిరి వైపు నుంచి సర్వీసు రోడ్డు మీదుగా రాంగ్‌రూట్‌లో హైవేపైకి వచ్చే క్రమంలో సి.మల్లవరం క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో సుదీప్, హేమంత్‌కు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ చిన్నగోవిందు తన వాహనంలోనే వారిని రుయా ఆసుపత్రికి తరలించారు. సుదీప్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

అప్పు తిరిగి చెల్లించమన్నందుకు దాడి


గాయపడిన కేశవులు

తిరుపతి (నేరవిభాగం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తమకు ఇవ్వాల్సిన అప్పు చెల్లించమని అడిగినందుకు భార్యాభర్తలపై కొందరు యువకులు దాడిచేసిన ఘటన తిరుపతి రూరల్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ చిన్న గోవిందు తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి రూరల్ మల్లంగుంట వినాయకనగర్‌కు చెందిన కేశవులు మూడు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన వినాయకకు అప్పుపై మాంసం విక్రయించారు. ఇందుకుగాను వినాయక కేశవులుకు రూ.1,200 చెల్లించాల్సి ఉంది. మూడు నెలలుగా ఇవ్వకపోవడంతో కేశవులు భార్య హేమలత 13వ తేదీన వినాయక ఇంటివద్దకు వెళ్లింది. అదే సమయంలో వినాయక కుమారులు ప్రదీప్, సందీప్, వారి స్నేహితుడు మరొకరు కలిసి హేమలతపై దాడి చేయడమేగాక ఆమె మెడలోని 34 గ్రాముల రెండు బంగారు గొలుసులను లాక్కున్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కేశవులుపైనా నిందితులు దాడి చేశారు. కేశవులు తలపపై గాయమైంది. రుయా ఆసుపత్రిలో చేరిన బాధితుడు 14వ తేదీన తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు.

అలరించిన గాలిపటాల పోటీలు


గాలిపటాలను ఎగరవేస్తున్న వాకర్స్ సంఘ ప్రతినిధులు

తిరుపతి (గాంధీరోడ్డు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల ప్రాంగణంలో గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గాలిపటాల పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు హాజరై గాలిపటాలను ఎగురవేసి సందడి చేశారు. గౌరవాధ్యక్షుడు పీసీరాయల్ మాట్లాడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధి ఆర్కాట్ కృష్ణప్రసాద్, అధ్యక్షుడు రఘురామిరెడ్డి, సలహాదారు బంగారుబాబు, శంకర్, ఎస్‌కే బాబు, రఘురాంరెడ్డి, జయరామయ్య, చక్రపాణి, పోతప్ప, ఉదయగిరి కృష్ణమూర్తి, భాస్కర్, గోపి, బాబు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు

ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ నాగరాజు


భక్తులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డైరెక్టర్ నాగరాజు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా త్వరలో తిరుమలకు మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ బోర్డు డైరెక్టర్ పి.నాగరాజు అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆయన అలిపిరి డిపో గ్యారేజీని సందర్శించారు. ఎలక్ట్రిక్ బస్సులు, ఛార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎలక్ట్రిక్ బస్సుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎలక్ట్రిక్ బస్సులో ఎక్కి, తిరుమలకు వెళ్లే భక్తులతో ముచ్చటించారు. కాలుష్య రహిత రవాణాను ప్రోత్సహించడం అభినందనీయమని భక్తులు కొనియాడారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి 7,500 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని, అందులో తిరుమల ఘాట్‌కు 80శాతం కేటాయించనున్నామని అన్నారు. అతి త్వరలో 50బస్సులు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం, ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ నిర్మాణం, పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి జి.నరసింహులు, సీటీఎం విశ్వనాథం, ఏటీఎం డి.రామచంద్రనాయుడు, డీఎంలు బాలాజీ, హరిబాబు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మెము ప్యాసింజర్ల రద్దుతో ఇక్కట్లు


తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఖాళీగా కనిపిస్తున్న టిక్కెట్ కౌంటర్లు

తిరుపతి(సెంట్రల్), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి- కాట్పాడి మధ్య నడుస్తున్న మెము ప్యాసింజర్లను రద్దు చేయడంతో సాధారణ ప్రయాణికులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు వారణాసి, ప్రయాగరాజ్(అలహాబాదు) వద్ద నిర్వహిస్తున్న మహాకుంభమేళాకు ఈ రైళ్లను గత నెల 27వ తేదీ నుంచి తరలించిన విషయం విదితమే. కాట్పాడి-తిరుపతి మార్గంలో రామాపురం, చిత్తూరు, పాకాల, పనపాకం, చంద్రగిరి ప్రధాన రైల్వేస్టేషన్లతో పాటు మరో పది చిన్న స్టేషన్లు ఉన్నాయి. నిత్యం 1,200 మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరందరికీ ఈ రైళ్లు ఎంతో సౌకర్యంగా ఉండేవి. వాటిని రెండు నెలల పాటు రద్దు చేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బస్సు చార్జీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వచ్చిన ఆదాయంలో సగం దానికే పోతోందని చిరు వ్యాపారులు, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది రైళ్లను తీసుకెళ్లి ఉత్తరాదిలో వాడుకోవడంపై ఇక్కడి ప్రజాప్రతినిదులు ప్రశ్నించాలని కోరుతున్నారు.

బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బ్యాంకుల్లో రెండు లక్షలకు పైగా ఉన్న ఖాళీలను భర్తీ చేసి, సిబ్బందికి పనిభారం తగ్గించాలని తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.ధన్వంత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. బ్యాంకుల్లో 10 ఏళ్ల క్రితం 6 లక్షల పైచిలుకు ఉద్యోగులు ఉండేవారని, తద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందేవని తెలిపారు. అటు తర్వాత ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో పని భారం పెరిగి ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను నియమించడం వల్ల అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రస్తుత జనాభాకు తగిన నిష్పత్తిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు.

ఆధునిక వసతులు కల్పించాలి

తిరుపతి(సెంట్రల్), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కార్పొరేట్ స్థాయిలో ఆధునిక వసతులు కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజరు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి రైల్వేస్టేషన్ దక్షిణం వైపున నిర్మిస్తున్న నూతన భవనాన్ని ఆయన పరిశీలించారు. బుకింగ్ కౌంటర్లు, విశ్రాంతి గదులు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఇతర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్‌ఎంఆర్ డాక్టర్ చిన్నరెడ్డెప్ప, అధికారులు మాధవరావు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కపిలతీర్థంలో తర్పణాలు



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం కపిలతీర్థంలో పెద్దసంఖ్యలో స్థానికులు పూర్వీకులకు తర్పణాలు వదిలారు. బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బెల్లం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్వాన్ కస్పా పద్మనాభన్, కామేష్‌బాబు, చిట్టిబాబు, ఆనంద్, వేణుగోపాల్, పనిభూషణరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా వంశీ

తిరుపతి (జీవకోన), జనవరి15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ యువజన విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఉదయం వంశీ నియమితులయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువతి మృతి

● వచ్చే నెలలో వివాహం ఉండగా విషాదం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆ యువతికి నిశ్చితార్థమైంది. వచ్చే నెలలో వివాహం జరగనుంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడటంతో అసువులు బాసింది. తిరుపతిలో జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌కు చెందిన మురళి, జ్యోతి దంపతుల కుమార్తె కీర్తి (20). ఆమెను సమీప బంధువుకు ఇచ్చి వివాహం చేయడానికి ఇటీవల నిశ్చితార్థం చేసుకున్నారు. ఫిబ్రవరిలో వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఆమె మిద్దెపైన ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా పాచి పట్టి ఉండటంతో జారి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. ఈస్ట్ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవిలాల చెరువుకు మహర్దశ

మినీ ఎకలాజికల్ పార్క్ కోసం ప్రణాళికలు


అవిలాల చెరువు - శిథిలావస్థకు చేరుకున్న సామగ్రి



తిరుపతి- ఆంధ్రజ్యోతి : తిరుపతికి సమీపంలోని అవిలాల చెరువు మినీ ఎకలాజికల్ పార్క్‌గా మారనుంది. ఆ మేరకు ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో తుడా, ఇరిగేషన్ అధికారులు, ఆర్కిటెక్ట్ నిపుణులతో సమావేశమై చెరువు అభివృద్ధిపై చర్చించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నిబంధనలు, ఆదేశాల మేరకు చెరువును వినియోగంలోకి తీసుకురావాలనే ప్రణాళికలపై కసరత్తు చేస్తున్నారు. జలాశయాలకు ఆటంకం కలగకుండా, కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టకుండా ఉద్యానవనాలు, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. టీటీడీ భాగస్వామ్యంతో అనతికాలంలోనే అవిలాల చెరువులో మినీ ఎకలాజికల్ ప్రాజెక్ట్ పార్కు పట్టాలెక్కనుంది.

● 2015లోనే అవిలాల చెరువు అభివృద్ధికి బాటలు

అవిలాల చెరువును ఎకలాజికల్ పార్కుగా అభివృద్ధి చేయాలని 2015లో టీడీపీ నిర్ణయం తీసుకుంది. జలవనరుల శాఖ అధికారులు చెరువు నిర్వహణ బాధ్యతను టీటీడీకి అప్పగించడంతో రూ18.50కోట్లతో అభివృద్ధి చేసేందుకు అప్పటి టీటీడీ పాలకమండలి ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీయూజీ, బీసీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఎకలాజికల్ పార్కుకు తొలి దశలో రూ80.14 కోట్లు, రెండో దశలో రూ101 కోట్లు వ్యయమవుతుందని ప్రతిపాదనలు రూపొందించింది. అప్పటి సీఎం చంద్రబాబు సమీక్షించి తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 2018 డిసెంబరు 6న ఎకలాజికల్ పార్కుకు భూమిపూజ చేశారు.

● .గత ప్రభుత్వ కుట్రతో అటకెక్కిన అవిలాల
అవిలాల చెరువులో వేగంగా పనులు చేపడుతున్న సమయంలో కొందరు ఎన్జీటీని ఆశ్రయించడంతో శాశ్వత కట్టడాలు కట్టకూడదని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రతిపాదనలను రూ.46 కోట్లకు కుదించారు. నిర్మాణంలో భాగంగా దాదాపు రూ.20 కోట్లు వ్యయం చేశారు. ఇంతలో వైసీపీ అధికారంలోకి రావడంతో 25 శాతం లోపు పనులు జరిగిన వాటిని నిలిపివేయాలన్న ఆదేశాలతో అవిలాల ప్రాజెక్టు అటకెక్కింది. అప్పటికే 25 శాతం కన్నా ఎక్కువ నిధులు ఖర్చుపెట్టినప్పటికీ అవిలాల చెరువు జోలికి వెళ్లేందుకు గత యంత్రాంగం ధైర్యం చేయలేదు. దీంతో చెరువు చుట్టూ ప్రహరీ గోడ మినహా దాదాపు రూ.10 కోట్ల విలువైన వస్తువులు చోరీ అవ్వడం, వృథాగా మారిపోవడం జరిగింది.

● ఇప్పుడిలా మారనుంది

201 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అవిలాల చెరువులో కేవలం 16 ఎకరాలను మాత్రమే ఉద్యానవనంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. 201 ఎకరాల్లో జాతీయ రహదారులు, ఇతర రోడ్లకు పోను 180 ఎకరాలు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందులో చెరువుకు పడమర వైపున 16 ఎకరాలను మాత్రమే వినియోగించి మిగిలిన భాగాన్ని చెరువుగా మార్చనున్నారు. చెరువు చుట్టూ దాదాపు 2.5 కిలోమీటర్ల మేర కట్టను దృఢంగా నిర్మించనున్నారు. దీనినే వాకింగ్ ట్రాక్‌గా వినియోగిస్తారు.

అనస్థీషియా టెక్నీషియన్ పేరిట బురిడీ

● రుయాలో 5 సవర్ల బంగారు గొలుసు కాజేసిన యువతి


పట్టుబడిన యువతి

తిరుపతి(వైద్యం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనస్థీషియా టెక్నీషియన్ పేరుతో ఒక యువతి రుయాస్పత్రిలోని అత్యవసర విభాగంలో చైన్ చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. రేణిగుంటకు చెందిన వెస్లీని ఆమె భర్త విక్టర్ మంగళవారం మధ్యాహ్నం రుయా అత్యవసర విభాగానికి తీసుకువచ్చాడు. అత్యవసర విభాగంలో ఓ యువతి తెల్లకోటు ధరించి అటుఇటు తిరుగుతూ వారితో మాటలు కలిపింది. తాను అనస్థీషియా టెక్నీషియన్ అని పరిచయం చేసుకుని అక్కడే ఉన్న వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లింది. వైద్యుడు గాయాలతో ఉన్న వెస్లీని పరిశీలించి స్కానింగ్ చేసుకుని రావాలని సూచించారు. వెస్లీని ఆ యువతే స్ట్రెచ్చర్‌పై స్కానింగ్‌కు తీసుకువెళ్లింది. స్కానింగ్ చేసే సమయంలో ఒంటిపై నగలు తీసేయాలని చెప్పడంతో మెడలోని రెండు బంగారు చైన్లతోపాటు రెండు బంగారు గాజులను తీసి ఆ యువతి చేతికి ఇచ్చి భర్త దగ్గర ఇవ్వాలని చెప్పింది. 5 సవర్ల బంగారు చైనును ఆ యువతి తన బ్యాగులో వేసుకుని మిగిలిన వస్తువులను విక్టర్ చేతికి అందించింది. మరో చైను ఉండాలని ఆయన అడగ్గా 'నాకు తెలియదు..మీరే ఎక్కడో పడేసుకుని ఉంటారు' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది. స్కానింగ్ తర్వాత బయటకు వచ్చిన వెస్లీ నగల గురించి భర్తను అడగ్గా చైను ఇవ్వలేదని చెప్పడంతో వెంటనే సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పారిపోవడానికి ప్రయత్నిస్తున్న సదరు యువతిని అడ్డుకున్నారు. బ్యాగులో వెతకగా వెస్లీ నుంచి చోరీ చేసిన బంగారు చైన్ కనిపించింది. విచారించగా తనపేరు తప్పెట్ల శ్రీవాణి అని, సొంతూరు కడప జిల్లా వల్లూరు అని, తాను ఇదే ఆస్పత్రిలో 2019లో అనస్థీషియా టెక్నీషియన్ కోర్సు చేశానని చెప్పుకొచ్చింది. ఇదే తరహాలో ఆస్పత్రిలో పలుమార్లు ఇటువంటి చోరీలకు పాల్పడినట్లు చెప్పింది. సెక్యూరిటీ సిబ్బంది ఆమెను వెస్ట్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల మధ్య ఘర్షణ

ఒకరికి కత్తిపోట్లు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్న విషయం యువకుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఒక యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. స్కావెంజర్స్ కాలనీకి చెందిన చీరలయ్య, స్పైడర్ కాలనీకి చెందిన సోము బైక్‌లో వేగంగా వెళుతున్నారు. దీన్ని గమనించిన వారి స్నేహితుడు శ్రీను నెమ్మదిగా వెళ్లమని చెప్పాడు. 'మాకు తెలుసు..నువ్వు చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సోమును ఇంటి వద్ద దింపిన చీరలయ్య తిరిగి వస్తూ శ్రీనును సలహాలు ఇవ్వద్దని చెప్పాలని సూచించాడు. 'ఆ విషయం నువ్వే చెప్పచ్చు కదా' అంటూ సోము ఎదురు తిరిగాడు. గొడవ జరిగింది. ఆవేశానికి లోనైన సోము ఇంట్లో ఉన్న కత్తి తీసుకొచ్చి చీరలయ్యపై దాడి చేశాడు. గాయపడడంతో అతడిని రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనాలు

ఐదురోజుల్లో 3.36 లక్షల మందికి దర్శనం


మంగళవారం శ్రీవారి ఆలయం ముందు భక్తుల రద్దీ

తిరుమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. తిరుపతి ఈనెల 8న వైకుంఠద్వార టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనతో ఏకాదశి, ద్వాదశి రోజుల్లో తిరుమలలో భక్తుల రద్దీ చాలా తక్కువగా కనిపించింది. తొలిరోజు 60,094 మంది, రెండవరోజు ద్వాదశిన 53,013 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. ఆతర్వాత భక్తుల రద్దీ పెరిగింది. ముందస్తుగా ఆన్‌లైన్‌లో రూ.300 దర్శనం, శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులు, తిరుపతిలో టోకెన్లు పొందిన భక్తులు దర్శనానికి వస్తున్నారు. మూడవరోజు ఆదివారం 70,966 మంది, సోమవారం 74,800, మంగళవారం 78వేల మంది చొప్పున ఐదురోజుల్లో 3,36,873 మంది దర్శించుకున్నారు. రూ.16.75 కోట్ల హుండీ కానుకలు రాగా, 79,002 మంది తలనీలాలు సమర్పించారు. కేవలం టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులు మాత్రమే తిరుమలకు రావడంతో బయట భక్తుల రద్దీ కనిపించడం లేదు. వచ్చినవారు వచ్చినట్టు శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి భక్తుల సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తునే ఉన్నారు. తిరుపతిలో 19వ తేదీకి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

మాజీ మంత్రి ఇంట గోపూజ



పుత్తూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో చివరిదైన పశువుల పండుగను మాజీ మంత్రి రోజా తన కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇంటికొచ్చిన గంగి రెద్దులకు పసుపు కుంకుమతో అలంకరించి వాయనాలను పెట్టి ఆరాధించారు. ఆమె భర్త సెల్వమణి, కుమారుడు కృష్ణలోహిత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పశువుల పండుగ

పుత్తూరు టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాడి రైతులు ఆఖరి రోజున పశువుల పండగను రైతులు వైభవంగా నిర్వహించారు. పాడి పశువులను కడిగి, కొమ్ములకు రంగులు పూసి, పూజలు చేశారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోండి

పుత్తూరు టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తడుకు సర్పంచు బొబ్బిలి యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన సంక్రాంతి సంబరాలలో భాగంగా క్రికెట్ టోర్నీ నిర్వహించారు. క్రికెట్‌లో విన్నర్స్‌గా నిలిచిన శీను టీంకు రూ. 3 వేలు, రన్నర్స్ నరసింహులు టీంకు రూ.2 వేలు అందించారు.

అంకాల పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలత్తూరు గ్రామంలో వెలసిన అంకాల పరమేశ్వరి అమ్మవారి వేడుకలను వైభవంగా నిర్వహించారు. యేటా కనుమ రోజున ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఆగమోక్తంగా సూర్యనారాయణస్వామి హోమం



వరదయ్యపాళెం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురంలో ఏకం, లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతిని పురస్కరించుకుని సూర్యనారాయణస్వామి హోమం ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు గోపూజ, గణపతిపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులచే సంకల్పం చేయించి సూర్యనారాయణ హోమం, గోత్రపూజలు, నామపూజలు, పుష్పార్చనలు నిర్వహించారు. బుచ్చినాయుడుకండ్రిగ, సత్యవేడు తదితర మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆనందగిరి, సునీల్, అరుణ్, లక్ష్మి దాసాజీ, బొప్పన రమేష్, గుత్తి త్యాగరాజు, దిలీప్ రాయల్, పురుషోత్తం, సురేందర్‌రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుకు ఘన సన్మానం



ఏర్పేడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నటుడు మోహన్‌బాబును మోదుగుల పాళెం వాసులు బుధవారం ఘనంగా సన్మానించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మోహన్‌బాబు వారిని ఎంతో ఆప్యాయంగా పలుకరించి గ్రామ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మోదుగులపాళెం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నంనాయుడు, దయాకర్ మొదలియార్, దినేష్ చౌదరి, చంద్రశేఖర్ చౌదరి, మంచు మస్తాన్‌నాయుడు, మణి, గ్రామస్థులు తదితరులున్నారు.

ముక్కంటి సేవలో సినీహీరో కృష్ణసాయి



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం సినీ హీరో కృష్ణసాయి దర్శించుకున్నాడు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పిచ్చాటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామపురం స్వామి ఎయిడెడ్ హైస్కూలులో 1997 ఏడాది టెన్త్ చదివిన విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు విద్యనందించి అభ్యున్నతికి కృషి చేసిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

మిస్టర్ ఇండియా పోటీల్లో వెంకటేష్‌కు ద్వితీయస్థానం

● మేలో థాయ్‌లాండ్‌కు ప్రయాణం



పిచ్చాటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మిస్టర్ ఇండియా పోటీల్లో మండలానికి చెందిన తోటి వెంకటేష్ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఎంపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన మిస్టర్ ఇండియా జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్ 60 కిలోల జూనియర్ విభాగంలో వెంకటేష్ ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో మే నెలలో థాయిలాండ్‌లో నిర్వహించే ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయాడు. కాగా వెంకటేష్ పిచ్చాటూరు పట్టణంలోని కేజీ హైడ్రాలిక్ జిమ్‌లో కోచ్.

పరశురామేశ్వరుడి సేవలో టీవీ నటుడు కౌశిక్



ఏర్పేడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరుని బుధవారం ప్రముఖ బుల్లితెర నటుడు కౌశిక్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నవోదయ పరీక్షా కేంద్రం మార్పు

సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి ఈనెల 18న నిర్వహించే పరీక్షా కేంద్రాన్ని మార్పు చేసినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ కె.శేఖర్ తెలిపారు. తొలుత స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మైదానంలో 17 నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ జరుగుతున్న నేపథ్యంలో డీఈవో ఆదేశాల మేరకు పట్టణంలోని వినాయకుడి గుడి వద్దనున్న నారాయణ పాఠశాలకు పరీక్షా కేంద్రాన్ని మార్చినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

17 నుంచి సౌత్ జోనల్ వాలీబాల్ టోర్నమెంట్

వెంకటగిరిటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 17,18 తేదీల్లో సౌత్ జోనల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు తెలిపారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం 25 జట్లు పాల్గొంటాయని, మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.25వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ చెంగల్‌రాయులు, సుబ్రహ్మణ్యం, నిర్వహకులు పాల్గొన్నారు.





బెలూన్ ఎగురవేసి ఏటిపండగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల, విజయభాస్కర్‌రెడ్డి, రఫీ తదితరులు - జనసంద్రమైన స్వర్ణముఖినది

వేడుకగా ఏటి పండుగ

● బెలూన్ ఎగురవేసి ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ

● జనసంద్రమైన స్వర్ణముఖి

నాయుడుపేట/టౌన్, జనవరి 15: నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలో ఏటి పండుగ వైభవంగా ప్రారంభమైంది. సంక్రాంతి మరుసటి రోజైన నుంచి కనుమ పండుగ నాటి నుంచి మూడు రోజులపాటు ఏటి నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నెలవల రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ జెయింట్ బెలూన్‌ను వదిలి ఏటి పండుగను ప్రారంభించారు.

సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా ఏడాది పండుగను కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం ఇక్కడి విశేషం. హిందువులతో పాటు ముస్లింలు, క్రైస్తవులు కుటుంబసభ్యులతో స్వర్ణముఖినది పరివాహక ప్రాంతానికి తరలివచ్చి ఏటి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. పెద్దలు, చిన్నారులతో కలసి ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. గాలిపటాల ఎగురవేత, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, పరుగు పందేలు, డీజే డ్యాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు.





సూళ్లూరుపేట కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న స్టేజీ - అట్టకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎఫ్‌వో శెల్వ, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, తహసీల్దార్ నరసింహారావు, డీఎఫ్‌వో హారిక

పక్షుల పండుగకు చకచకా ఏర్పాట్లు

తడ/సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో స్టాల్స్ ఏర్పాటుకు టెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు స్టేజీ, పట్టణంలో జీఎన్‌టీ రోడ్డు డివైడర్లపై పచ్చదనం పరిమళించేలా మొక్కలు ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో పక్షుల పండుగ ప్రారంభంకానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

సూళ్లూరు పేట(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను సీఎఫ్‌వో శెల్వం, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రం, అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎఫ్‌వో శెల్వం మాట్లాడుతూ పక్షుల పండగకు వచ్చే సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో హారిక, రేంజర్ నరసింహారావు, తహసీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.

నేలపట్టులో...

దొరవారిసత్రం(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, తిరుపతి సీఎఫ్(చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం పరిశీలించారు. పక్షుల కేంద్రంలో స్టాల్స్ ఏర్పాట్లు, వీఐపీ వాహనాల పార్కింగ్, సందర్శకులకు నీటి వసతి, ఇతర సదుపాయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. వారివెంట తహసీల్దారు శైలాకుమారి, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, ఎంపీడీవో గోవర్ధన్, ఇతర అధికారులు, ఉన్నారు.

పండుగ విజయవంతానికి కృషి

తడ(ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మత్స్యశాఖ డీడీ నాగరాజు వెల్లడించారు. బుధవారం అటవీశాఖ సీసీఎఫ్ సెల్వంతో కలసి భీములవారిపాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన ఏర్పాట్లపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పడవలరేవులో జెట్టిల ఏర్పాటు, స్టేజీ నిర్మాణం, పార్కింగ్ వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో టూరిజం పీడీ శోభన్‌బాబు, డీఎఫ్‌వో హారిక, సోషల్ వెల్ఫేర్ డీడీ చిన్నయ్య, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, విద్యుత్‌శాఖ ఏఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

పక్షుల పండుగకు కొరవడిన ప్రచారం

సూళ్లూరుపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పక్షుల పండుగకు ప్రచారం కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న ఫెస్టివల్‌పై కనీసం సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో కూడా ప్రచారం అంతంత మాత్రంగానే ఉంది. గతంలో పక్షుల పండుగ అంటే నెల రోజుల ముందే హడావిడి, హంగు ఆర్భాటం ఉండేది. ఈ సారి ప్రకటనే తప్ప పండుగను విజయవంతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ప్రచారం చేసేవారు. ప్రచార పోస్టర్లే కాకుండా ఆయా ప్రాంతాల్లో స్థానిక మీడియా ద్వారా ప్రచారం చేయించేవారు. ప్రస్తుతం స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు కొరిడి - పేర్నాడు, వేనాడు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పక్షులను తిలకించాలంటే ఈ మార్గాల్లో సందర్శకులు వెళ్లాలి. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మరమ్మతులు చేసేవారు. ఈ మార్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేయలేదు. పండుగకు నియమించిన ప్రత్యేక కమిటీలు కూడా చొరవచూపక పోవడం గమనార్హం.

పడవలరేవులో పర్యాటకుల సందడి



పడవ షికారుకు వెళ్తున్న జనం

తడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భీములవారిపాళెం పడవలరేవులో బుధవారం పర్యాటకుల సందడి కనబడింది. చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు కార్లు, టెంపోలలో పడవల రేవుకు వచ్చారు. ప్రైవేట్ పడవలను అద్దెకు మాట్లాడుకొని పులికాట్ సరస్సులో షికారుకు ఉత్సాహం చూపారు. మరో రెండు రోజుల్లో పక్షుల పండుగ ప్రారంభం కానుండగా ముందుగానే పర్యాటకులు పడవలరేవుకు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.





వెంకటగిరిలో గౌరమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు - చిల్లకూరులో గోమాతకు పూజలు

వైభవంగా సంక్రాతి సంబరాలు

వెంకటగిరి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మంగళవారం నాడు పెద్దలకు బట్టలు పెట్టారు. కనుమ పండుగ రోజు బుధవారం రైతులు పశువులకు అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని కాశీతోటలో కామాక్షీ సమేత విశ్వనాథేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు గొబ్బి పాటలు పాడుతూ గౌరమ్మను నిమ్మజ్జనం చేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు. బంగారుపేటలో గౌరమ్మను తప్పెట్లు, మంగళవాయిద్యాలు, కోటాల మధ్య వైభవంగా నిర్వహించారు.

గూడూరు(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి రోజున మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. మృతి చెందిన కుటుంబ పెద్దల చిత్రపటాల వద్ద కొత్తబట్టలు పెట్టి పూజలు చేశారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా పశువులను అలంకరించి పూజలు నిర్వహించారు. పశువుల కొట్టాల వద్ద ముగ్గులు వేసి, తంగేడు పూలతో గౌరమ్మకు పాడిరైతులు పూజలు జరిపారు.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ గోశాలలో బుధవారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో వెంకటరత్నమాచారి సహకారంతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. గో మాతలను అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. అదేవిధంగా మండల ప్రజలు మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, ప్రగతి సేవాసంస్థ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం కనుమ పండుగ ఘనంగా జరుపుకున్నారు. పశువులను శుభ్రం చేసి అలంకరించారు. పొంగళ్లు పొంగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం కనుమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పశువులను అందంగా అలంకరించి పూజలు చేశారు.

సదరన్ రైల్వే బోర్డు సభ్యుడిగా పేర్నాటి జోసెఫ్



నాయుడుపేట టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే బోర్డు సభ్యుడిగా నాయుడుపేటకు చెందిన పేర్నాటి జోసెఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు సదరన్ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జోసెఫ్‌ను సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మస్తాన్, ఉపాధ్యక్షుడు ఆర్.రాఘవన్, ఆర్గనైజర్లు కె.కిరణ్, రవి, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ప్రధానితో పరీక్షా పే చర్చకు జిల్లా విద్యార్థి



శ్రీకర్

తిరుపతి(విద్య), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతో జరుగనున్న పరీక్షా పే చర్చ కార్యక్రమానికి జిల్లాకు చెందిన విద్యార్థి శ్రీకర్ ఎంపికైనట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికచేసిన విద్యార్థులు, వారి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రధాని ప్రత్యక్షంగా సమావేశమవుతారు. పరీక్షల్లో ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశాలను విద్యార్థులకు ప్రధాని వివరిస్తారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీకర్ ఈ ఏడాది జిల్లా నుంచి ఎంపికయ్యాడు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన శ్రీకర్, ఎస్కార్ట్ ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.





డక్కిలి మండలం లింగసముద్రం, బాలాయపల్లి మండలం మన్నూరులో కోడి పందేలు

కోడి పందేల జోరు

డక్కిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాల్లో అన్ని రోజులూ డక్కిలి మండలంలో కోడి పందేల నిర్వహణ జోరుగా సాగింది. సోమవారం డక్కిలికి సమీపంలోని కంథలవారిపల్లి వద్ద, మంగళవారం నాడు శ్రీపురం, ఆల్లూరుపాడు గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. బుధవారం లింగసముద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా బరి నిర్మించారు. ఇతరులు ఎవ్వరూ బరిలోకి రాకుండా ముళ్ల కంపలతో కంచె ఏర్పాటు చేశారు. కోడి పందేలలో పాల్గొనే వారిని మాత్రమే లోనికి అనుమతించారు. కోడి పందేలతో పాటు డైమండ్ డబ్బా, మూడు ముక్కలాట, పేకాట వంటి జూదాలు నిర్వహించారు. పండుగ దినాల్లో నిర్వహించిన కోడి పందేల్లో రోజూ లక్షలాది రూపాలు చేతులు మారినట్లు సమాచారం. కాగా, కోడి పందేల స్థావరాల వద్ద యువత, చిన్న పిల్లలు కూడా ఎక్కుగా కనిపించడం గమనార్హం. ఇంత జరుగుతున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడ లేదన్న విమర్శలు వినిపించాయి.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరులో నాలుగు రోజుల పాటు కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన పోలీసులు నాలుగు రోజులుగా పందేలు సాగుతున్నా అటువైపు చూడకపోవడం గమనార్హం.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పత్రపల్లి, చెలికంపాడు, కుర్జాగుంట గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. దాడులు నిర్వహించి 9కోళ్లు, రూ.27200 నగదు స్వాధీనం చేసుకుని, 24 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. ప్రధానంగా కోట మండలంలోని కర్లపూడి, కొత్తపట్నం, యమదిన్నెపాళెం, చిల్లకూరు మండలం మన్నెగుంట, కాకువారిపాళెం ప్రాంతాల సరిహద్దుల్లో కోడి పందేల నిర్వహణ జరిగింది. నెల్లూరు జిల్లా నుంచేకాక తమిళనాడులోని సేలం ప్రాంతాల నుంచి కోడిపుంజులను తెప్పించారు. ఒక్కో కోడిపుంజును రూ.38వేల నుంచి రూ.50వేలు వెచ్చించి కొనుగోలు చేసి బరిలో నిలిపారు. ఒక్కొక్క తమిళ కోడిపై లక్ష రూపాయలపైనే బెట్టింగ్ కాస్తున్నట్లు తెలిసింది.

వైభవంగా మకరజ్యోతి వేడుకలు



సూళ్లూరుపేట అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి పూజలు

సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం మకరజ్యోతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి ఆలయంలో ఉదయం అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మకరజ్యోతిని వెలిగించి ఆలయం చుట్టూ ప్రదర్శగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మకరజ్యోతిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అదేవిధంగా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగేశ్వరస్వామి ఆలయంలోనూ మకరజ్యోతి పూజలు జరిగాయి.

కోట(ఆంధ్రజ్యోతి): కోటలోని ఆర్టీసీ సెంటర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం మకరజ్యోతి వేడుకలు జరిగాయి. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు మకర సంక్రాంతిని పురస్కరించుకొని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో కర్పూరాలతో మకరజ్యోతి వెలిగించారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో విద్యార్థులకు అవకాశం

గూడూరు అర్బన్, సూళ్లూరుపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 18,19,20 తేదీల్లో జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఇందులో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని డిప్యూటీ ఈవో సనత్ కుమార్ తెలిపారు. 16వ తేదీ సాయంత్రం లోగా నెం.9441937349, 9346600127లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలకు సంబంధించి పురుషులకు వాలీబాల్, కబడ్డీ, మహిళలకు త్రోబాల్, టెన్నీకాయిట్, బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నామన్నారు. 16వ తేదీ సాయంత్రంలోగా నెం.9347038584, 9966081144లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సత్రవాడ ప్రవీణ్‌కు ఘన సత్కారం



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్‌ను పలువురు యువకులు ఘనంగా సత్కరించారు. సత్రవాడ ప్రవీణ్ యూత్ అసోసియేషన్‌లోని సభ్యులు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఉద్యోగాలు చేస్తుంటారు. యేటా సంక్రాంతి రోజున మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య స్వగృహంలో యువత సమ్మేళనం నిర్వహిస్తుంటారు. ఆ రోజున వీరంతా ఒకటై సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాది మంగళవారం రోజున యువత కలుసుకుని సత్రవాడ ప్రవీణ్‌ను సత్కరించారు.

కనులపండువగా మాల మార్పిడి ఉత్సవం



చప్పరంపై విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు

నారాయణవనం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం గోదాదేవి, కల్యాణ వెంకన్న మాల మార్పిడి కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం గోదాదేవి, స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించారు. తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన స్వామిఅమ్మవార్లకు పరిణయ పుష్పమాలలను మూడుసార్లు మార్చారు. రాత్రి 8 గంటలకు ఏకాంతసేవతో భోగ శ్రీనివాసుడి పవలింపు సేవను నిర్వహించారు. ఆలయాధికారి నాగరాజు సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లికొండేశ్వరాలయంలో కనుమ పండుగ



నాగలాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వ రాలయంలో బుధవారం కనుమ పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని గోశాలలో బొమ్మరిల్లు ఏర్పాటు చేసి గోవులను రంగులతో, నూతన వస్త్రాలతో, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం గోవులకు దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం మహా హారతులు చేపట్టి వైభవంగా కనుమ పండుగను నిర్వహించారు. ఈ పూజలకు ఊత్తుకోటకి చెందిన లోకనాధన్ కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ పూజాకార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

గొబ్బెమ్మ పుర విహారం



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం శాస్త్రోక్తంగా ప్రదోషమూర్తుల పల్లకి గిరిప్రదక్షిణ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల గిరిప్రదక్షిణలో భాగంగా ప్రదోషమూర్తుల పల్లకి గిరిప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయితీ. ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గొబ్బెమ్మ (మనోణ్మణి) అమ్మవారిని అలంకార మండపంలో పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం సింహవాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం గోదాదేవి కల్యాణం



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో కొలువై ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం మహిళామండలి ఆధ్వర్యంలో గోదాదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా విష్ణు సేవారాధన, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం కలశానికి పూజలు నిర్వహించారు. గోదాదేవి, రంగనాథస్వామిని సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రోచ్చరణల మధ్య గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. తీర్థప్రసాదాలు అందజేశారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలోని 16 కాళ్ల మండపం వద్ద అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఘనంగా గోపూజ

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తగోకులంలో బుధవారం కనుమ పండుగను పురస్కరించుకుని ఘనంగా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి నివాళులు



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరులో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి మంగళవారం సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరను కల్పించాలని టీడీపీ మండల నాయకులు సీఎం చంద్రబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తిరుపతి విమానాశ్రయంలో సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 75 కిలోల ధ్యానానికి రూ.1,730 అని తెలిపారు. అయితే ధాన్యం కేంద్రాలు లేకపోవడంతో దళారులు రంగప్రవేశం చేసి కేవలం రూ.1,500 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. కిషోర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మునస్వామియాదవ్, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి గిరిప్రదక్షిణ సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. శివకుమార్, తోట గణేష్, పేట చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, పేట చిరంజీవి, సురేష్, దుమ్ము రాయల్ వీర మహిళలు పాల్గొన్నారు.

ఆది దంపతుల కల్యాణానికి రారండి

దేవతలు, మునులకు ఆహ్వానం ● వైభవంగా గిరి ప్రదక్షిణ






రాజగోపురం మీదుగా వేంచేస్తున్న స్వామిఅమ్మవార్లు - పట్టణంలో పురవిహారం - కైలాసగిరిలో భక్తుల నడక - అంజూరు మండపం వద్ద భక్తుల సందడి

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆది దంపతుల కల్యాణానికి దేవతలు, మునులకు బుధవారం ఆహ్వానం పలికారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న ఆది దంపతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ముక్కంటి ఆలయంలో కొలువు దీరిన శివపార్వతులు యేటా కనుమ పండుగ రోజున కైలాసగిరుల ప్రదక్షిణ చేసి దేవతలను, రుషులను ఆహ్వానిస్తారు. ఇందులో భాగంగా ఈ యేడాది కూడా ఈ కార్యక్రమం జరిగింది. మొదట జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను చప్పరాలపై అధిష్ఠింపజేసి... కైలాసగిరి ప్రదక్షిణకు బయలుదేరారు. పట్టణంలో విహరిస్తున్న స్వామి అమ్మవార్లకు భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా చతుర్మాడ వీధులు శివనామస్మరణతో మారుమోగాయి. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులు జయరామరావువీధి, కైలాసగిరికాలనీ, రామచంద్రాపురం, రాజీవ్‌నగర్ మీదుగా గిరి ప్రదక్షిణకు వెళ్లారు. రామాపురం రిజర్వాయర్ సమీపంలో ఉన్న అంజూరు మండపం వద్ద స్వామిఅమ్మవార్లను ఉంచారు. అక్కడ పూజలు చేశారు. గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఆ తరువాత స్వామి అమ్మవార్లను వెయ్యిలింగాల కోన, వేడాం, వేడాం మిట్టకండ్రిగ, తుఫాను సెంటరు మీదుగా శుకబ్రహ్మాశ్రమం వద్ద ఎదురు సేవ మండపంలో కొలువుదీర్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణలో తోపులాటలు ... గిరిప్రదక్షిణలో పలుచోట్లతోపులాటలో చోటు చేసుకున్నాయి. అధికారుల సమన్వయ లోపం పలుచోట్ల స్పష్టంగా కనిపించింది. భక్తులకు అవస్థలు తప్పలేదు. ఇక ట్రాఫిక్ సమస్య కూడా భక్తులను వెంటాడింది. ఈ యేడాది కొత్తగా కైలాస రిజ్వాయర్‌నుంచి తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఇది మంచి ఆలోచనే అయినప్పటికీ ఆ చరణలో కొత్త సమస్యలను ఉత్పన్నం చేసింది.





స్వామిఅమ్మవార్లకు స్వాగతం పలుకుతున్న భక్తులు - కైలాసగిరి వద్ద అన్నదానం - రామాపురం రిజర్వాయర్ వద్ద భక్తుల సందడి

అంబరం... ఎదురుసేవ సంబరం





పుష్పాలంకరణలో ఎదురుసేవ మండపం - మండలంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లు - పట్టణంలో స్వామిఅమ్మవార్ల విహారం

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి బుధవారం సాయంత్రం ఎదురు సేవ కార్యక్రమం అంబరాన్నంటింది. వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతుల కల్యాణానికి దేవతాగణాలను, మునులను ఆహ్వానించేందుకు స్వామిఅమ్మవార్లు కైలాస గిరుల ప్రదక్షిణకు వెళ్లారు. గిరి ప్రదక్షిణ ముగించుకుని వచ్చిన స్వామిఅమ్మవార్లకు పట్టణ శివార్లలోని శుక బ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురుసేవ మండపం వద్ద భక్తులు ఘనస్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లు కొద్దిసేపు ఎదురుసేవ మండపంలో సేద తీరారు. అక్కడ ఉన్న కోనేరు జలాలతో స్వామిఅమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ఆలయానికి తరలివెళ్లారు. ఎదురు సేవ కోసం భక్తులు ఎడ్లబండ్లలో వెళ్లి సందడి చేశారు. రాత్రి స్వామిఅమ్మవార్లు పట్టణంలో ఊరేగారు.

వైభవంగా పుర ఉత్సవం

స్వామిఅమ్మవార్ల పుర ఉత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అంతకు ముందు గిరిప్రదక్షిణలో భాగంగా స్వామి అమ్మవార్లను ఎదురుసేవ మండపం వద్ద కొలువుదీర్చారు. పూజలు అనంతరం స్వామి అమ్మవార్లను ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి పట్టణంలో ఊరేగించారు.

వెండి నాగపడిగ వితరణ



శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్‌కు చెందిన కేతన సాయికుమార్ కుటుంబ సభ్యులు రూ.3.80లక్షల విలువైన వెండి నాగపడిగలను వితరణ చేశారు. ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ధర్మరాజు తిరునాళ్ల



వరదయ్యపాళెం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎల్ఎన్‌పల్లిలో కనుమ పండుగను పురస్కరించుకుని ధర్మరాజుల తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు పరిసర ప్రాంతాలనుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ద్రౌపదీ సమేత ధర్మరాజు పంచపాండవులతో పాటు పోతురాజు, శ్రీకృష్ణుడు విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాజేంద్రప్రసాద్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.


నాగలాపురం(ఆంధ్రజ్యోతి): విద్య, మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను నాగలాపురం మండలానికి చెందిన తిరుపతి పార్లమెంట్ ఐ టీడీపీ అధ్యక్షుడు యాచేంద్ర నాయుడు నారావారిపల్లెలో మంత్రి లోకేశ్‌ను ఆయన స్వగృహం వద్ద కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ల్యాప్‌టాప్ అందజేత

శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను ఆర్టీసీ అధికారులు అందజేశారు. ఏర్పేడు మండలానికి చెందిన మునిశేఖర్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ల్యాప్‌ట్యాప్‌ను బస్సులో మరచి పోయాడు. ఆర్టీసీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మునిశేఖర్ ఆర్టీసీ అధికారులను సంప్రందించగా వివరాలు అడిగి అందించారు.

గౌరమ్మలకు పూజలు





శ్రీకాళహస్తి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలం పాళెంలో కొలువైన గౌరమ్మలకు బుధవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో చాలా సంవత్సరాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. పట్టణంలో మరెక్కడా జరగని విధంగా వీధిలో ముగ్గురు గౌరమ్మలు ఉంటారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆయా ప్రాంత మహిళలు గొబ్బిపాటలు పాడుతూ అమ్మవార్లను కొలుస్తారు. ఈ ఉత్సవం భోగి, సంక్రాంతి, కనుమ పండుగ రోజుల్లో మరింత వేడుకగా జరుగుతుంది. బుధవారం అర్ధరాత్రి నిమజ్జనంతో ఈ వేడుక ముగిసింది. మహిళలు, చిన్నారులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ నేపథ్యంలో వీధిలో విద్యుత్ దీపాలంకరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

టీడీపీతోనే చేనేతల సంక్షేమం

నారాయణవనం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని నారాయణవనం జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమర్ అన్నారు. బుధవారం ఆయన చేనేత కార్మికుల యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణవనంలో నేసే వస్త్రాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. భాస్కరన్, హరి, మాణిక్యం రెడ్డి, సుబ్రమణ్యం, కేశవులు, చంద్రశేఖర్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి వీడ్కోలు





ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సుధీర్‌రెడ్డి, ఆదిమూలం - సీఎంను సత్కరిస్తున్న మాజీ మంత్రి చెంగారెడ్డి

రేణిగుంట/ పిచ్చాటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు లభించింది. సంక్రాంతిని పురస్కరించుకుని సొంతూరు నారావారిపల్లెకు వచ్చిన ఆయన పండుగ అనంతరం మంగళవారం రాత్రి రోడ్డు మార్గాన తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ముఖ్యమంత్రికి శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ మంత్రి చెంగారెడ్డి, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, శ్రీధర్‌వర్మ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, కలెక్టర్ వెంకటేశ్వర్ సాదరంగా వీడ్కోలు పలికారు. అలాగే మంత్రి లోకేశ్‌కు కూడా సాదర వీడ్కోలు లభించింది. బుధవారం మధ్యాహ్నం నారావారిపల్లి నుంచి తిరుపతి విమానా శ్రయం చేరుకున్న ఆయనకు శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లారు.

అనుమానాస్పద స్థితిలో నెల్లూరువాసి మృతి



మునెయ్య మృతదేహం

ఏర్పేడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటకు చెందిన పిమునెయ్య(48) అనుమానాస్పద స్థితిలో ఏర్పేడు మండలంలోని మేర్లపాక హైవే పక్కన మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సీఐ జయచంద్ర సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. సీఐ తెలిపిన వివరాలు... నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటకు చెందిన మునెయ్య భార్య 10 సంవత్సరాల క్రితం చనిపోయింది. ఇతనికి కుమారుడు మునిరాజా ఉన్నాడు. ఇతనికి వివాహమై తిరుపతిలోని మంగళంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. నెల్లూరు నగరంలో టీ దుకాణంలో పని చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యానికి బానిసై ఎక్కడపడితే అక్కడ పడిపోతున్నట్లు కుమారుడు తెలిపాడు. సంక్రాంతి పండుగ కోసం మంగళంలోని కుమారుడి ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం మంగళం నుంచి తిరిగి నెల్లూరుకు బయలుదేరాడు. అప్పటిమే మద్యం తాగి ఉన్నాడు. మార్గమధ్యంలో మేర్లపాక ఎల్లమ్మ ఆలయం వద్ద మళ్లీ మద్యం తాగాడు. మత్తులో కింద పడడంతో తలకు కుడి వైపు నుదుటి భాగంలో రక్తగాయమైంది. అతిగా మద్యం సేవించి మరణించినట్లు తెలుస్తోంది. మునిరాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.